సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 16 । నవంబర్ । 2023



ఎన్ని'కళ'లో..
అసెంబ్లీ ఎన్నికల వేళ హోటళ్లు, మద్యం, పూల దుకాణాలకు గిరాకీ పెరిగింది.
వివరాలు 10లో ▸



రూ.1.34 కోట్ల ఆదాయం..
అలంపూర్ ఆలయాలకు వేలం ద్వారా రూ.1.34 కోట్ల ఆదాయం సమకూరింది.
వివరాలు 12లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /21.9

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోండి



గండేడ్: ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అడిషనల్ ఎస్పీ సురేష్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు వెన్నాచేడ్, సల్కర్‌పేట్‌లో మహమ్మదాబాద్ ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పారా మిలటరీ దళాలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ ఆయా గ్రామాల్లోని ఓటర్లలో ధైర్యం నింపారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు.

నేడు ఇథనాల్ బాధిత గ్రామాల సందర్శన

పాలమూరు: రెండేళ్లుగా చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళనలు జరుగుతున్నాయని, సెప్టెంబర్ 22న జరిగిన దాడిపై గ్రామాల పరిస్థితి తెలుసుకోవడానికి ప్రొఫెసర్ హరగోపాల్ ఆధ్వర్యంలో గురువారం బాధిత గ్రామాలను సందర్శిస్తారని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 22న జరిగిన ఘటనలో అనేక మంది రైతులు, కూలీలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని, కొందరు బెయిల్‌పై బయటకు వస్తే మరికొందరు జైలులో ఉన్నారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు హరగోపాల్‌తో పాటు శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయం విద్యార్థులు, రచయితలు చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ బాధితులను కలుస్తారని తెలిపారు.

కనీస పెన్షన్ పెంపుదల కోసం ఆందోళనలు




స్టేషన్ మహబూబ్‌నగర్: ఈపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ పెంపుదల కోసం ఆందోళనల్లో భాగంగా డిసెంబర్ 7న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు అన్నారు. జిల్లాకేంద్రం పారిశ్రామికవాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో బుధవారం ఆర్టీసీ, ప్రభుత్వ రంగసంస్థల ఈపీఎస్ పెన్షనర్ల జాతీయ సంఘర్షణ సమితి జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజసింహుడు మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ పెంపుదలపై సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించడంలో కూడా కేంద్ర ప్రభుత్వం అలసత్వం వహించడం తగదన్నారు. కనీస పెన్షన్ పెంపుదల కోసం తమసమితికి హామీ ఇచ్చి ఒక నిర్ణయానికి రాకపోవడం శోచనీయమన్నారు. కనీస పెన్షన్ పెంపుదల కోసం ఇక ఉపేక్షించేది లేదని, ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 20న హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన భవన్‌లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు జిల్లాలోని ఆర్టీసీ, ఈపీఎస్ పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అబ్దుల్ కరీం, భగవంతు, నారాయణ, ఉమేష్ కుమార్, మోహన్‌రెడ్డి, బస్వరాజ్, అనంతరెడ్డి పాల్గొన్నారు.

లెక్క తేలింది!

మూడు నియోజకవర్గాల్లో 42 మంది పోటీ

- మహబూబ్‌నగర్, జడ్చర్లలో 15 మంది, దేవరకద్రలో 12 మంది బరిలో..
- పదిమంది నామినేషన్ల ఉపసంహరణ
- ఇక హోరెత్తనున్న ప్రచారం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/జెడ్పీసెంటర్ /జడ్చర్ల/ దేవరకద్ర: ఎన్నికల ప్రక్రియలో కీలకఘట్టం ముగిసింది. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులెవరో లెక్క తేలింది. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 42 మంది పోటీలో ఉన్నారు. ఆయా నియోజకవర్గాలకు 58 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. అందులో స్క్రూట్నీ సందర్భంగా ఆరుగురివి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 52 మంది అభ్యర్థుల్లో పది మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో పోటీలో ఉన్న మిగిలిన అభ్యర్థుల తుది జాబితాను అధికారులు ప్రకటించారు. ఇందులో మహబూబ్‌నగర్‌లో 15 మంది, జడ్చర్లలో 15 మంది, దేవరకద్రలో 12 మంది పోటీలో నిలిచారు.

■ ఇక బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా తేలడంతో ఇక ప్రచారం హోరెత్తనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే వాడవాడలా, ఇంటింటికీ తిరుగుతూ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసిన నేపథ్యంలో ప్రచారం మరింత జోరందుకోనుంది.

నియోజకవర్గాల వారీగా ప్రధాన పార్టీల అభ్యర్థులు



మహబూబ్‌నగర్: శ్రీనివాస్‌గౌడ్ బీఆర్ఎస్ | శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ | మిథున్‌రెడ్డి బీజేపీ

జడ్చర్ల: లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ | అనిరుధ్‌రెడ్డి కాంగ్రెస్ | చిత్తరంజన్‌దాస్ బీజేపీ

దేవరకద్ర: ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ | జి.మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ | ప్రశాంత్‌రెడ్డి బీజేపీ

జడ్చర్ల

జడ్చర్ల నియోజకవర్గంలో నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 15 మంది అభ్యర్థులు బరిలో నిలవగా.. ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి మధ్యే పోటీ నెలకొంది. బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే చిత్తరంజన్‌దాస్ బరిలో ఉన్నప్పటికీ.. పోరు నామమాత్రమేనని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

పోటీలో ఉన్నవారు..: డా.సి. లక్ష్మారెడ్డి(బీఆర్ఎస్), జనంపల్లి అనిరుధ్‌రెడ్డి(కాంగ్రెస్), చిత్తరంజన్‌దాస్ (బీజేపీ), శివకుమార్(బీఎస్పీ), ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ (ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), ఇమ్మడి ఆనంద్(బహుజన ముక్తి), అనిల్‌కుమార్ (జన శంఖారావం), కె.నర్సింగ్‌రావు(గణసురక్ష పార్టీ), కోస్గి యాదయ్య(ధర్మసమాజ్), మాతాశ్రీ జానకమ్మ(రాష్ట్ర సమాఖ్య ప్రజా పార్టీ), శ్రీకాంత్ పిల్లెల (భారత చైతన్య యువజన పార్టీ), వెల్జాల బసవయ్య(ఆర్.సీపీఐ), స్వతంత్రులు ఏ.రవికుమార్, ఎల్.మోహన్, ముడావత్ శంకర్.

దేవరకద్ర

దేవరకద్ర నియోజకవర్గంలో ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 12 మంది బరిలో నిలిచారు. ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి కొండా ప్రశాంత్‌రెడ్డి పోటీ పడుతున్నారు. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ద్విముఖ పోరు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. బీజేపీకి చెందిన బాలకృష్ణ అలియాస్ దేవరకద్ర బాలన్న తన నామినేషన్‌ను ఉప సంహరించుకున్నారు. అలాగే మరో స్వతంత్ర అభ్యర్థి ఎండీ అబ్దుల అజీజ్ ఖాన్ నామినేషన్‌ను ఉప సంహరించుకున్నారు.

పోటీలో ఉన్నవారు..: ఆల వెంకటేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్), కొండా ప్రశాంత్‌రెడ్డి (బీజేపీ), జి.మధుసూదన్‌రెడ్డి (కాంగ్రెస్), బసిరెడ్డి సంతోష్‌రెడ్డి (బీఎస్పీ), గద్దం ఎల్లప్ప (ప్రజాఏక్తా పార్టీ), జి.కతలయ్య (విద్యార్థుల రాజకీయ పార్టీ) బి.జంగయ్య (ధర్మ సమాజ్‌పార్టీ), బి.రాఘవేంద్ర (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), బి.మధుసూదన్‌రెడ్డి (జన శంఖారావం పార్టీ), స్వతంత్రులు మందడి వెంకట నర్సింహారెడ్డి, రాము, ఏ.వెంకటేశ్వర్‌రెడ్డి.

మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో నలుగురు నామినేషన్లను ఉపసంహరించుకోగా.. **15 మంది బరిలో ఉన్నారు. అయితే ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి కుమారుడు ఏపీ మిథున్‌రెడ్డి** మధ్యే పోరు కొనసాగనుంది.

పోటీలో ఉన్నవారు..: వి.శ్రీనివాస్‌గౌడ్ (బీఆర్ఎస్), మిథున్‌రెడ్డి(బీజేపీ), యెన్నం శ్రీనివాస్‌రెడ్డి(కాంగ్రెస్), స్వప్న (బీఎస్పీ), ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ (బహుజన్ ముక్తి పార్టీ), టి.కృష్ణ(భారత చైతన్య యువజన పార్టీ), ఖాదర్ (ప్రగతిశీల సమాజ్ పార్టీ), మున్నూర్ రవి (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), రాములు (ధర్మ సమాజ్), శ్రీనివాస్‌రెడ్డి (జన శంకరం పార్టీ), స్వతంత్రులు అశోక్‌కుమార్ గజ్బింకర్, కారుకొండ శ్రీనివాసులు, ఎండీ ఇంతియాజ్ అహ్మద్, ఎండీ షరీఫ్, ఎం.శ్రీనివాసులు.

13 నియోజకవర్గాల్లో.. 186 మంది పోటీ

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. షాద్‌నగర్ మినహా మిగిలిన 13 నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం గడువు ముగిసే వరకు మొత్తం 37 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 186 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీఎస్పీ తదితర పార్టీలు, స్వతంత్రులు పోటీలో ఉన్నప్పటికీ.. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే పోరు కొనసాగనుంది.

జంగ్ తెలంగాణ

నామినేషన్ల విత్‌డ్రా, పోటీలో ఉన్న వారి వివరాలు..

నియోజకవర్గం	ఉ.సం.	బ.ని.వా.
మహబూబ్‌నగర్	4	15
దేవరకద్ర	2	12
జడ్చర్ల	4	15
నారాయణపేట	0	7
మక్తల్	1	11
వనపర్తి	1	13
నాగర్‌కర్నూల్	8	15
కల్వకుర్తి	3	24
కొల్లాపూర్	4	14
అచ్చంపేట	3	14
అలంపూర్	5	13
గద్వాల	0	20
కొడంగల్	2	13
మొత్తం	37	186

ఉ.సం.: ఉపసంహరణ,
బ.ని.వా.: బరిలో నిలిచిన వారు

గుర్తుల కేటాయింపు..పరిశీలన

మహబూబ్‌నగర్‌లో అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు సంజయ్ కుమార్ మిశ్రా, అసెంబ్లీ వ్యయ పరిశీలకుడు కుందన్‌యాదవ్, దేవరకద్రలో ఎన్నికల వ్యయ పరిశీలకులు తేజశ్వి, ఐపీఎస్ అధికారి ఇళక్కియా కరునాగరన్ పాటు ఆయా రిటర్నింగ్ అధికారులు అనిల్‌కుమార్, నటరాజ్ తదితరులు పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపును పరిశీలించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు వరుసగా ఆ తరువాత రిజిస్టర్ గుర్తింపు రాజకీయ పార్టీల అభ్యర్థులకు, చివరగా స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు.



దేవరకద్ర రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమావేశమైన అధికారులు, అభ్యర్థులు

ప్రశాంత వాతావరణంలో

ఎన్నికలు

జిల్లాలో 7,07,698 మంది ఓటర్లు

- మూడు నియోజకవర్గాల్లో 42 మంది పోటీ
- 835 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నామినేషన్ల ఉపసంహరణ అనంతరం జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 42 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.రవినాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 19 నామినేషన్లు చెల్లుబాటులో ఉండగా, మంగళ, బుధవారాలలో నలుగురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారని.. దీంతో 15 మంది బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు. జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 మంది, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో శాసనసభ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో, స్వేచ్ఛగా నిర్వహించేందుకు మొత్తం 835 పోలింగ్ కేంద్రాలతో పాటు, మూడు ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 272 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మరో 3 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించామని తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గంలో 274, దేవరకద్ర నియోజకవర్గంలో 289 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఓటర్లు ఓటు వేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

పక్కాగా బందోబస్తు..

పోలీస్ పెట్రోలింగ్, సీఏఎఫ్ బృందాల బందోబస్తు ఏర్పాటు చేశామని, మొదటి విడత రెండు కంపెనీల సీఏఎఫ్ బృందాలు జిల్లాకు వచ్చాయని, రెండోవిడత ఈ నెల 20న ఆరు కంపెనీల సీఏఎఫ్ బృందాలు రానున్నాయని ఎస్పీ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. వీరందరూ ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేపడతారని పేర్కొన్నారు. అలాగే పోలింగ్ రోజు కర్ణాటక నుంచి మరో 750 మంది పోలీస్‌ఫోర్స్ వస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.3.55కోట్ల విలువైన నగదు, 2,600 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు పోలీసు బందోబస్తు పక్కగా నిర్వహిస్తున్నామని, 1950 హెల్ప్‌లైన్‌తో పాటు, పోలీస్ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సమాచార శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ జె.ఇస్రా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్

■ నవంబర్ 10 నాటికి జిల్లాలో మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,52,318 మంది ఓటర్లు, జడ్చర్ల నియోజకవర్గంలో 2,20,233 మంది, దేవరకద్ర నియోజకవర్గంలో 2,35,147 మంది మొత్తం 7,07,698 మంది ఓటర్లు ఉన్నారని, వీరికి అదనంగా 780 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లాలో మూడు నియోజకవర్గాలలో కలిపి 12,931 మంది దివ్యాంగ ఓటర్లు, 18 ఏళ్ల వయసున్న ఓటర్లు 24,380 మంది, 80 ఏళ్ల పైబడిన ఓటర్లు 6,788 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఎవరైనా దివ్యంగ ఓటర్లు ఓటు వేయలేని పక్షంలో సాక్ష్యం యాప్ ద్వారా వారికి వీల్ చైర్స్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 835 పోలింగ్ కేంద్రాల్లోని సగం కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించేందుకు చర్యలను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఓటరు సమాచార స్లిప్పులు బుధవారం నుంచి 25 వరకు ఓటర్లకు అందజేయడం జరుగుతుందని, అయితే ఈ స్లిప్పులు కేవలం ఓటు హక్కును తెలుసుకోవడానికి మాత్రమే ఉపయోగపడతాయన్నారు. ఓటర్లు ఓటు వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానిని చూపించి ఓటు వేయాలని కోరారు.

■ పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగులు, అత్యవసర సేవలు అందించే వారి కోసం పోస్టల్ బ్యాలెట్ ఇస్తామన్నారు.ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 16 మంది నోడల్ అధికారులను నియమించామని, 93 సెక్టోరల్ అధికారులను, 9 ఎఫ్ఎస్‌టీ బృందాలు, 11 ఎస్ఎస్‌టీ బృందాలు, 3 వీఎస్టీ, 3 వీవీటీ బృందాలు, 3 సహాయక వ్యయ పరిశీలకులు, 17 ఎంసీసీ బృందాలు, ఒక ఎంసీఎంసీ, జిల్లాస్థాయిలో ఎన్నికల వ్యయ నిర్వహణకు సంబంధించి ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే ఐదు అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సువిధ ఆప్ ద్వారా సింగిల్ విండో పద్ధతిలో అన్ని రకాల అనుమతులను ఇస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

అసెంబ్లీ ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్ కుమార్ మిశ్ర బుధవారం ధర్మాపూర్ సమీపంలో ఉన్న జేపీఎన్‌సీ కాలేజీలో ఏర్పాటు చేయనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల కోసం అందుబాటులో ఉన్న గదులు, అభ్యర్థులు వారి ఏజెంట్లు, ఓట్ల లెక్కింపు కేంద్రానికి విధులు నిర్వహించేందుకు వచ్చే అధికారులు సిబ్బంది, కేంద్రంలోకి వచ్చేందుకు దారులు తదితర అన్ని అంశాలను కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్‌తో చర్చించారు. పోలీసులు పరిశీలకులు ఇళక్కియా కరుణాగరన్, ఏఎస్పీ రాములు, డీఆర్‌ఓ రవికుమార్, మహబూబ్‌నగర్ రిటర్నింగ్ అధికారి అనిల్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



హంస వాహనంపై ఊరేగుతున్న కురుమూర్తిస్వామి

హంసవాహనంపై కురుమూర్తిరాయుడు

చిన్నచింతకుంట: అమ్మాపురం సమీపంలో సప్తగిరుల్లో వెలిసిన కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజు బుధవారం స్వామివారికి హంసవాహన సేవ నిర్వహించారు. ఉదయం అవాహిత దేవతాపూజలు, హోమం జరిపించారు. రాత్రి ఉత్సవమూర్తులను హంసవాహనంపై ఆసీనులను చేసి, కాంచనగుహ నుంచి కొండపై ఉన్న ద్వారం వరకు ఊరేగించారు. ఈ సందరంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆలయ ఈఓ మదనేశ్వరెడ్డి, అప్పంపల్లి సింగిల్‌విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



కొత్త ఓటర్లు @ 1,13,550

- ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా గద్వాలలో 12,385 మంది..

వనపర్తి: ప్రస్తుత అసెంబ్లీ పోరులో కొత్త ఓటర్లు కీలకంగా మారనున్నారు. ఈ నెల 10న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి పాలమూరులోని 12 నియోజకవర్గాల్లో తొలిసారి ఓటుహక్కు వినియోగించుకోనున్న యువత 1,13,550 మంది ఉన్నారు. గెలుపు ఓటములను శాసించే స్థాయిలో కొత్త ఓటర్లు ఉన్నట్లు చెప్పుకోవచ్చు. అత్యధికంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో 12,385 మందికి ఉండగా.. అత్యల్పంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 7,116 మంది ఉన్నారు.

వనపర్తిలో అత్యధిక ఓటర్లు..
ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అత్యధికంగా వనపర్తిలో 2,71,151 మంది ఓటర్లు ఉన్నట్లు తాజా ఓటర్ల విడుదలతో స్పష్టమవుతోంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి ఓటు వేయనున్న యువ ఓటర్లు 12,073 ఉన్నారు.

ఆకర్శించేందుకు ప్రయత్నాలు..
కొత్త ఓటర్లను ఆకర్శించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు.



నియోజకవర్గాల వారీగా కొత్త ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
వనపర్తి	13,073
జోగుళాంబ గద్వాల	12,385
అలంపూర్	10,760
నారాయణపేట	10,002
కల్వకుర్తి	9,720
మక్తల్	9,620
అచ్చంపేట	9,302
దేవరకద్ర	8,479
మహబూబ్‌నగర్	8,209
కొల్లాపూర్	8,192
జడ్చర్ల	7,692
నాగర్‌కర్నూల్	7,116

యువ ఓటర్లు ఎటువైపు?

సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉండే యువ ఓటర్ల మద్దతు ఎటువైపు ఉంటుందోనన్న భయం ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో నెలకొన్నట్లు తెలుస్తోంది. వారిని ప్రసన్నం చేసుకున్న వారికే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతం పోటాపోటీ ఉన్న నియోజకవర్గాల్లో గెలుపును నిర్ణయించే అవకాశం కొత్త ఓటర్లకు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సోనామసూరి ధర రూ.2,409

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,409, కనిష్ఠంగా రూ.1,801గా నమోదయ్యాయి. హంస ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.1,849, కనిష్ఠంగా రూ.1,779గా ధరలు లభించాయి. వరి కోతలు ప్రారంభం కావడం వల్ల మార్కెట్‌కు 10వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.



విజయవంతమైన ప్రజాస్వామ్యం వెనుక తప్పకుండా అహింస ఉంటుంది.
- మహాత్మాగాంధీ

ఓటు బహిర్గతం నిషిద్ధం



ఎన్నికల్లో ఓటును బహిర్గతం చేయడం నిషిద్ధం. కొందరు కావాలని తాము ఓటు వేసేటప్పుడు సెల్ఫీ తీసుకుని తాను ఫలానా వారికి ఓటేశానని ప్రచారం చేసుకుంటారు. ఇది పూర్తిగా నిషిద్ధం. పోలింగ్ కేంద్రంలో ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో మొబైల్ ఫోన్‌తో సెల్ఫీ దిగడం.. ఇతరులకు చూపించడం నిషిద్ధం. ఒకవేళ అలా చేస్తే నిబంధన 49ఎం (ఓటు రహస్యం), బహిర్గత నియమం మేరకు ఎన్నికల అధికారులు సదరు ఓటరును బయటకు పంపిస్తారు. ఈ ఓటును నిబంధన 17ఏలో నమోదు చేస్తారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఆ ఓటును పరిగణలోకి తీసుకోరు. ఇదిలా ఉండగా అంధ ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనడానికి 18ఏళ్లు నిండిన వారిని సహాయకులుగా వెంట తీసుకెళ్లే అవకాశం ఉంది. వెంట వెళ్లే సహాయకుడు అతడి ఓటును బహిర్గతపర్చనని ధ్రువీకరించాల్సి ఉంటుంది.

- అడ్డాకుల

ఊరి కోసం ఎవళ్లు ఎం అడుగతలేరు..

'ఓ మామ శాన జోరుగా తయారై యాడికో పయనమైతివి' అంటూ ఇంటి నుంచి నడుచుకుంటూ రోడ్డెక్కిన రంగయ్యను పలకరించాడు సోమయ్య. 'అవును సోమయ్య పట్నంల పనిపడింది.. పొద్దుమూకేయాలకు తిరిగి ఊరికి చేరుకోవాలి' అంటూ ఇద్దరు మాట్లాడుకుంటూ బస్టాఫ్ వద్దకు చేరుకున్నారు. బస్సు రావడం కాస్త ఆలస్యం కావడంతో సోమయ్య, రంగయ్య అక్కడే కూర్చొని మాటల్లో పడ్డారు. 'ఇగో మామా ఇప్పుడు ఎలచ్చన్ల హడావిడి జోరుగా ఉంది కదా.. లీడర్ల వెనుక కార్యకర్తలు, పోరగాళ్లు మస్తుగా తిరుగుతున్నరు.. ఓటు యేసే దాకా అడిగిందే తడువు లీడర్లు ఎం కావాలన్నా తెచ్చి పెడుతుండ్రు.' అని సోమయ్య చెబుతుండగా.. రంగయ్య మధ్యలో కలుగజేసుకుని 'ఆ ఎం లాభం సోమయ్య.. రానురాను ఎలచ్చన్ల సమయంలో ఊరికి ఉపయోగపడే పనులు అడగడం మానేస్రను.. యంతిస్తవ్, నాకేమిస్తవ్, నా కుటుంబానికేమిస్తవ్ అంటున్నారే తప్ప గెలిస్తే ఊరికి ఎం చేస్తవని ఎవరూ అడుగతలేరు. ఊరికి వచ్చే రోడ్లు, పిల్లలు సదువుకునే బడ్లు బాగా లేకున్నా ఏ ఒక్కరు అడగడంలేదు. ఊరికి ఉపకారం చేసే టోడిని గెలిపిద్దామని ఎవరు అనుకోవడం లేదు. ఎంతసేపు ఎవడి స్వార్థం వాడు చూసుకుని ముందుకు పోతున్నారు. ఎం చేస్తమ్ సోమయ్య కలికాలం'.. అని అంటుండగానే పట్నం పోయే బస్సు హారన్ మోగించుకుంటూ వచ్చింది. రంగయ్య బ్యాగ్ సర్దుకుని బస్సెక్కి పట్నం పోవడంతో సోమయ్య ఇంటిముఖం పట్టిండు.

- గట్టు





ఎన్నికల ప్రచారమంటే గుంపుల కొద్ది కండువాలు కప్పుకున్న కార్యకర్తలు కనిపించాల్సిందే. సభ అంటేనే భారీ జన సందోహం సందడి చేయాల్సిందే. ప్రజలు రాకపోతే సభ, ప్రచారం వెలవెలబోతాయి. ఆ అభ్యర్థికి ఆదరణ లేదన్న ప్రచారాన్ని ప్రత్యర్థులు చేస్తారు. అందుకే అభ్యర్థులు, వారి అనుచరులంతా సభలకు, ర్యాలీలకు, ప్రచారాలకు జనసమీకరణపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. జనం తన వెంట అధికంగా ఉన్నారని చూపేందుకు పోటీపడుతున్నారు. అన్నివర్గాల ప్రజలను ఆకట్టుకునేలా భారీ ర్యాలీలు.. డీజేలు, మైకుల మోత, కళాకారుల నృత్యాలు, కోలాటాల నడుమ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా గ్రామాలు, పట్టణాల్లో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. రోజుకు రూ.300 నుంచి రూ.500 కూలీ ఇచ్చి తీసుకెళ్తున్నారు. ఒకేరోజు రెండు పార్టీల మీటింగ్‌లు, ప్రచారాలు ఉంటే మాత్రం కూలీల రేటు మరింత పెరుగుతుంది. అభ్యర్థులు ఓట్ల కోసం చెమటోదుస్తుండగా.. మరోవైపు మద్యం, బిర్యానీ సెంటర్లు, పూలదండల వ్యాపారం ఊపందుకుంది.

- అచ్చంపేట

ఎన్నికళలో..

- జోరందుకున్న ఎన్నికల ప్రచారం
- ర్యాలీలు, బహిరంగ సభలకు భారీగా జనసమీకరణ
- మద్యం, హోటళ్లు, పూలదండలకు భలే గిరాకీ
- చేరికలు చూపడానికి కండువాలు కప్పుతున్న నేతలు
- నేడు ఒక పార్టీ.. రేపు మరోదానికి జై కొడుతున్న జనం



ఇవాళ ఇక్కడ.. రేపు అక్కడ

కూలీలు సైతం ఎవరు ఎక్కడ డబ్బులు ఇస్తే ఆ రోజు వారికే ప్రచారం చేస్తున్నారు. ఈరోజు ఒక పార్టీకి జైకొడితే.. రేపు మరోపార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తున్నారు. పలుచోట్ల చేరికల సందర్భంగానూ ఇలాంటి వింతలే కనిపిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో తమ పార్టీలోకి ఎక్కువ చేరికలు జరిగాయని చెప్పుకొనేందుకు కూలీలకు సైతం కండువాలు కప్పుతున్న నేతలకు లెక్కే లేదు. ఈ వ్యవహారాన్ని చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

స్వచ్ఛందంగా వచ్చే వారేరీ?

ఒకప్పుడు పల్లెకో.. పట్టణానికో నాయకుడు వస్తే జనం స్వచ్ఛందంగా తరలివచ్చేవారు. నేతలతో కలిసి ర్యాలీలో పాల్గొనేవారు. సభల్లో వారి ప్రసంగాలు వినేందుకు పోటీపడేవారు. కానీ, ప్రస్తుతం రాజకీయాలు మారిపోయాయి. ముఖ్యంగా కార్యకర్తలు తప్ప పని వదిలి ప్రచారానికి తరలివచ్చేవారు.. నేతల మాటలు వినేవారు కరువయ్యారు. దీంతో అభ్యర్థులు, ఆశావహులు సభలు, ప్రచారాల కోసం కూలీలను ఆశ్రయిస్తున్నారు.

సామాజిక మధ్యమాల్లో..

ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఈ క్రమంలో ఏదైనా విషయం సులువుగా వ్యాపించే సామాజిక మాధ్యమాలను పూర్తిగా వినియోగించుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, ట్విటర్‌తోపాటు ఎస్‌ఎంఎస్‌లు, వాయిస్ కాల్స్‌తో నిత్యం ఓటర్లకు చేరువవుతున్నారు. దీంతో డిజిటల్ మార్కెటింగ్ చేసే చాలామందికి చేతినిండా పని లభిస్తోంది.

వాహనాలకు డిమాండ్..

ప్రచారం ఊపందుకోవడం, పార్టీల ముఖ్య నేతల ప్రచార సభల నేపథ్యంలో ఆటోలు, ట్యాక్సీలు, ట్రావెల్స్‌కు డిమాండ్ ఉంది. ప్రచారానికి నియోజకవర్గ స్థాయిలో తిరుగుతున్న సమయాల్లో పార్టీల అనుచర గణాన్ని తరలించేందుకు ప్రైవేట్ వాహనాలను మాట్లాడుకుంటున్నారు. అలాగే నియోజకవర్గం, జిల్లా పరిధిలో నిర్వహించే సభలకు వందల సంఖ్యలో వాహనాలు అవసరమవుతున్నాయి.

కళాకారుల ఆటాపాట..

ఎన్నికల ప్రచారంలో ప్రజలను ఉత్తేజపర్చాలంటే కళాకారుల ఆటాపాట ఉండాల్సిందే. ప్రచార జోరులో కళాకారులు హోరెత్తిస్తున్నారు. కళాకారులు పాడే పాటలతో ప్రచారానికి ఊపొస్తుంది. కళాకారులతోపాటు కోలాటం, బతుకమ్మ ఆడే మహిళలకు సైతం ఉపాధి బాగా దొరుకుతోంది.

బీరు.. బిర్యానీతో..

పార్టీల కోసం ప్రచారం చేసే నాయకులంతా పొద్దంతా కష్టపడి సాయంత్రం బీరు, బిర్యానీతో చిల్ అవుతున్నారు. ఎన్నికల ర్యాలీల పుణ్యమా అని మద్యం అమ్మకాలు అమాంతం పెరిగాయి. శ్రేణులు చేజారిపోకుండా మందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులు దీంతో వంటలు, కేటరింగ్ చేసే వారికి చేతినిండా పని దొరుకుతుండగా.. బిర్యానీ సెంటర్లకు గిరాకీ పెరిగింది.

ఎన్నికల సిత్రాలు..

కొడితే హ్యాట్రిక్



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉదయం బీఈడీ కళాశాల గ్రౌండ్‌లో వాకర్స్‌తో కలిసి క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముచ్చటించారు. ఈ సందర్భంగా స్టేడియంలో క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

దేవుడా ఆశీర్వదించు!



మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని దేవున్ని కోరారు.

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

చేతిలో చెయ్యేసి..



నవాబుపేట మండలంలో ప్రచారం చేపట్టిన జడ్చర్ల కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి లోకిరేవులో మహిళలతో కరచాలనం చేస్తూ.. ఓటెయ్యండి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

- నవాబుపేట

ఓటర్లకు బజ్జీలు వేసిచ్చి..



గోపాల్‌పేటలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి అభ్యర్థి తూడి మేఘారెడ్డి సంతలో ప్రచారం చేశారు. ఈ క్రమంలో కూరగాయలు తూకం వేశారు. హోటల్‌లో బజ్జీలు వేసి ఓటర్లకు ఇచ్చారు.

- గోపాల్‌పేట

ముద్ద పెట్టు... ఓటు పట్టు



ఆత్మకూర్ మున్సిపాలిటీలో మాజీ వార్డు సభ్యుడు రామకృష్ణయాదవ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా, ఆరుబయట భోజనం చేస్తున్న మహిళ అన్నం ముద్ద తినిపించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తానని చెప్పుకొచ్చింది.

- ఆత్మకూర్

సమోస తినండి.. ఓటు మరవకండి



బీఆర్‌ఎస్ అభ్యర్థి మహేశ్‌రెడ్డి సతీమణిగా నేను మీకు అండగా ఉండి.. సమస్యలు తీరుస్తానని ప్రతిమారెడ్డి గండేడ్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హోటళ్లలో టీ, సమోస, పూరి చేసి ఓట్లను అభ్యర్థించారు.

-గండేడ్

అవ్వా మరువకే.. నీ ఓటు కారుకే..



మహబూబ్‌నగర్ మండలం కోడూరులో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలితో ముచ్చటిస్తూ.. నీ ఓటు బీఆర్‌ఎస్‌కే వేయాలని వేడుకున్నారు.

- మహబూబ్‌నగర్ రూరల్

రేవంత్‌రెడ్డి గుండాయిజానికి భయపడేది లేదు

- రాష్ట్ర గనుల శాఖా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

కోస్గి: ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి తన గుండాలు, రౌడీలతో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, రేవంత్‌రెడ్డి గుండాయిజానికి ఎవరూ భయపడేవారు లేరని రాష్ట్ర గనుల శాఖా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం సర్జఖాన్‌పేటలో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో గ్రామాన్ని సందర్శించి, దాడిలో గాయపడిన బాధితులను వారి ఇళ్లకు వెళ్లి మంత్రి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముందస్తుగా ఓ పక్కా ప్రణాళికతో రేవంత్‌రెడ్డి దాడులకు తెర లేపారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి తన రౌడీలను తెచ్చి రాళ్ల దాడి చేయించడంతో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు గాయపడ్డారన్నారు. ఎవరి ప్రచారం వారు చేసుకొని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకుంటేనే ఇరువర్గాలకు మంచిదన్నారు. గ్రామాల్లో ఎక్కడికెళ్లిన ఎమ్మెల్యేగా నరేందర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, ప్రజలు రెండోసారి సైతం నరేందర్‌రెడ్డిని గెలిపించాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా నరేందర్‌రెడ్డి రెండోసారి గెలవడం, రాష్ట్రంలో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. దాడులు చేయడంతో గాయపడిన బాధిత కుటుంబాలను పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. పార్టీ ఇన్‌చార్జీలు బాబా ఫసీయోద్దీన్, కిషన్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి చరిత్ర మొత్తం గుండాయిజం, రౌడీయిజం చేయడమేనన్నారు. ప్రస్తుతం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రేవంత్‌రెడ్డి భుజంపై గన్ను పెట్టి రాజకీయాలు నడిపిస్తున్నారన్నారు. కొడంగల్ ప్రజలు నరేందర్‌రెడ్డి వంటి రాముడి పాలన కావాలో, రేవంత్‌రెడ్డి వంటి రాక్షస పాలన కావాలో తేల్చుకోవాలన్నారు. సర్జఖాన్‌పేటలో ప్రశాంతంగా ప్రచారం చేసుకుంటున్న బీఆర్‌ఎస్‌నాయకుల వాహనాలను ధ్వంసం చేశారన్నారు. ఇప్పటికైనా గుండా రాజకీయాలకు స్వస్తి చెప్పాలన్నారు.

మేధావులు చైతన్యం కల్పించాలి

- కేంద్ర మంత్రి భగవంతు కూబ



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భగవంతు కూబ

పాలమూరు: వైద్యులు, న్యాయవాదులు, మేధావులు ఆయా విభాగంలో ఓటర్లను చైతన్యం చేసి బీజేపీకి మద్దతు తెలిపి, అభ్యర్థిని గెలిపించడానికి కృషి చేయాలని కేంద్ర మంత్రి భగవంతు కూబ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో బుధవారం రాత్రి మేధావుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం వివరించాలని, మోదీ ప్రధాని అయిన తర్వాత దేశం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరులో బీజేపీ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీర బ్రహ్మచారి, మనోహర్‌రెడ్డి, అనంతరెడ్డి, బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ మార్చొద్దని డిమాండ్



పాత పోలింగ్‌బూత్ వద్ద ఏర్పాట్లు చేయలేదని చూపిస్తున్న గ్రామస్తులు

మహమ్మదాబాద్: మండలంలోని సంగాయపల్లిలో ఉన్న పోలింగ్ బూత్‌ను సంగాయపల్లితండాకు మారిస్తే ఎంతో మంది ఓటర్లు ఇబ్బందులు పడుతారని గ్రామస్తులు బుధవారం తెలిపారు. 40 ఏళ్ల నుంచి ప్రత్యేక పోలింగ్ బూత్ సంగాయపల్లిలో ఉండటంతో అన్ని గ్రామాలు, తండాల ప్రజలకు ఓటు వేసేందుకు ఎంతో అనుకూలంగా ఉండేదని ప్రస్తుతం అధికారులు ఎవరినీ సంప్రదించకుండా బూత్‌ను మార్చారని ప్రశ్నిస్తున్నారు. కాగా పాత పోలింగ్ బూత్ వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం, కొత్త పోలింగ్ బూత్ వద్ద నంబర్ కేటాయించడంతో ఆందోళన మొదలైంది. బొమ్మికుంటతండా, బాపనికుంటతండా, సంగాయపల్లి, సంగాయపల్లితండా గ్రామాలకు ఒకే బూత్ ఉండగా ఇప్పుడు ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు గమనించి మళ్లీ పోలింగ్ బూత్‌ను పాతస్థానంలోనే ఉంచాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఏసయ్యను వివరణ కోరగా రికార్డు ప్రకారమే సంగాయపల్లిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కారు బోల్తా.. కర్ణాటక వాసి మృతి



లింగంపల్లి సమీపంలో బోల్తాపడ్డ కారు

నారాయణపేట రూరల్: బంధువుల ఇంట్లో వేడుకకు వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కాచవార్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉమారెడ్డి, భార్య భారతమ్మ (60)తో కలిసి గుర్మిట్కల్‌లో స్థిరపడ్డారు. వారి బంధువులు మరికల్ మండలం పెద్దచింతకుంటలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలకు దంపతులిద్దరు బుధవారం ఉదయం బయలుదేరారు. కార్యక్రమం ముగిసిన తర్వాత సాయంత్రం తిరిగి వెళ్తున్న క్రమంలో నారాయణపేట మండలం లింగంపల్లి స్టేజీ సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారుకు అడ్డంగా కుక్కలు రావడంతో డ్రైవర్ వాటిని తప్పించబోయి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. వేగంగా ఉన్న కారు ఒక్కసారిగా పల్టీలు కొట్టి బోల్తాపడింది. అటుగా వస్తున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులు వారిని కారులో నుంచి బయటకు తీయగా భారతమ్మ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఉమారెడ్డితోపాటు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నగదు సీజ్

కొత్తకోట రూరల్: పెద్దమందడి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న తనిఖీల్లో బుధవారం రూ.3లక్షలు పట్టుబడినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా పెద్దమందడి మండలంలోని మోజర్ల చెక్‌పోస్టు వద్ద రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా అమరచింతకు చెందిన సంధ్య పాగ కృపానందం వద్ద ఈ నగదు పట్టుబడినట్లు పేర్కొన్నారు. నగదును హైదరాబాద్ నుంచి అమరచింతకు తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.

గద్వాల క్రైం: పోలీసులు నిర్వహించిన తనిఖీలో బుధవారం పట్టణ పోలీసుల రూ. 2లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్పీ రితిరాజ్ ప్రకటనలో తెలిపారు. నగదుకు సంబంధించిన రశీదులు లేకుండా తీసుకెళ్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వన్‌టౌన్ పోలీసులు చేసిన తనిఖీల్లో నగదు పట్టుబడింది. పట్టణంలోని క్లాక్‌టవర్ చౌరస్తాలో చేసిన వాహనాల తనిఖీల్లో అబ్దుల్ రావూఫ్ వద్ద రూ.99, 050నగదు పట్టుబడగా సదరు నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ సైదులు తెలిపారు. సీజ్ చేసిన నగదు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు వెల్లడించారు.

మీకు తెలుసా?

ఆనాడు 21 ఏళ్లు ఉంటేనే ఓటు హక్కు

దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన రోజుల్లో ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలంటే 21 సంవత్సరాల వయస్సు ఉండాల్సిందే. అంత కన్నా తక్కువ వయస్సు వారికి ఓటు హక్కు ఉండేది కాదు. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకు తగ్గించారు. అప్పటి నుంచి నేటి వరకు అదే విధానం కొనసాగుతుంది.

ఉరి వేసుకుని యువకుడి బలవన్మరణం

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో నివాసముంటున్న కమ్మరి బ్రహ్మయ్య(23) ఇంట్లో ఉరేసుకుని మృతిచెందినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. బుధవారం ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ జిల్లా గొనెగండ్ల మండలం, కున్నూరుకి చెందిన కమ్మరి బ్రహ్మయ్య కంచుపాడులో తమ అత్త మహేశ్వరమ్మ ఇంట్లో నివాసముండేవాడు. అతను డిగ్రీ పూర్తి చేసుకున్నాడు. మద్యానికి బానిసవడంతో మనస్తాపానికి గురై ఇంటి పైకప్పునకు చీరతో ఉరేసుకున్నాడు. అత్త ఇంట్లోకొచ్చి చూసేసరికి వేలాడుతూ కనిపించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారందరూ వచ్చి అతడిని కిందకు దించి, చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అత్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

పాడిరైతులపై 'సంగం డెయిరీ' దాడి

కర్రలు, రాడ్లు, రాళ్ల దాడిలో 15 మంది ఏలూరు జిల్లా రైతులకు గాయాలు

చేబ్రోలు: ఒప్పందం ప్రకారం తమకు ఇవ్వాల్సిన బోనస్ డబ్బులు ఇవ్వడంలేదనే విషయాన్ని సంగం డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని వచ్చిన రైతులపై డెయిరీ కిరాయి సిబ్బంది దాడిచేశారు. కర్రలు, రాడ్లు, రాళ్లతో రైతుల మీద ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. రైతులు వాహనాలు దిగుతుండగానే డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర అనుచరులు బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని సంగం డెయిరీ వద్ద బుధవారం జరిగిన ఈ దాడిలో ఏలూరు జిల్లాకు చెందిన 15 మంది రైతులు గాయపడ్డారు. వీరిలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం వేములపల్లి, రంగపాలెం గ్రామాల్లో ద్వారకామాయి డెయిరీ పాయింట్‌తో సంగం డెయిరీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం పాడి రైతులకు రూ.50 లక్షల వరకు బోనస్ చెల్లించాల్సి ఉంది. ఈ మిల్క్ సెంటర్ నిర్వాహకులైన వేములపల్లి సర్పంచి ముసులూరి రాము, నర్సనపాలెం సర్పంచి కూరపాటి వెంకటేశ్వరరావు తమ పరిధిలో పాలు సేకరించి సంగం డెయిరీకి సరఫరా చేశారు. ఒప్పందంలో భాగంగా 14% బోనస్ ఇస్తామన్న డెయిరీ అధికారులు తరువాత మాట మార్చి నాలుగు శాతం మాత్రమే ఇస్తామనడంతో వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై అక్కడ పోలీసు స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు కూడా చేశారు. గుడ్ ఫార్మర్స్‌గా గుర్తించి న్యాయం చేస్తామని మిల్క్ సెంటర్ నిర్వాహకులకు, రైతులకు వేములపల్లిలో సంగం డెయిరీ జీఎం కొల్లి ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆ హామీని కూడా నెరవేర్చలేదు. బోనస్ గురించి అడిగితే బోనస్ ఇవ్వడానికి పాలకవర్గం తీర్మానం చేయాల్సి ఉందని, 4% కన్నా ఎక్కువ ఇవ్వడం కుదరదని చెప్పారు. ఈ సమస్యను సంగం డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని అక్కడి రైతులు నిర్ణయించారు. దీనిపై వేములపల్లి, రంగపాలెం గ్రామ సర్పంచులతోపాటు సుమారు 30 మంది రైతులు బుధవారం ఆరు వాహనాల్లో సంగం డెయిరీకి వచ్చారు. రైతులకు న్యాయం చేయాలనే నినాదంతో కూడిన ప్లకార్డుల్ని వాహనాల్లో తీసుకొచ్చారు. రైతుల రాకను పసిగట్టిన సంగం డెయిరీ సిబ్బంది, గూండాలు యాజమాన్యం ఆదేశాలతో దౌర్జన్యానికి దిగారు. వందమంది కర్రలు, రాడ్లు, రాళ్లతో రైతులపై దాడిచేశారు. రైతులు కారు దిగుతుండగానే మీదపడి కొట్టారు. భయాందోళనలతో పరారవుతున్న రైతులను వెంటపడి మరీ కొట్టి గాయపరిచారు. ఐదుకార్లను ధ్వంసం చేశారు. ఈ దాడిలో 15 మంది రైతులు గాయపడ్డారు.



మాచర్లలో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

ప్రజలతోనే మా పొత్తు

నెరవేర్చిన హామీలే నా ధైర్యం, జనమే నా నమ్మకం

వరికపూడిశెల ఎత్తిపోతలకు శంకుస్థాపనలో సీఎం వైఎస్ జగన్



సాక్షి ప్రతినిధి, గుంటూరు: వచ్చే ఎన్నికల్లో తమ పొత్తు ప్రజలతోనే ఉంటుందని, పేద ప్రజల కోసమే తమ పార్టీ ఉందని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నెరవేర్చిన హామీలు, ప్రజలే తన ధైర్యం, నమ్మకం అని స్పష్టం చేశారు. నేను విన్నాను, నేను ఉన్నాను అని పునరుద్ఘాటించారు. వైఎస్సార్‌కు, వైఎస్ జగన్‌కు తెలిసిందల్లా ప్రజల్లో నడవడం, ప్రజల గుండెల్లో ఉండటమేనన్నారు. పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ.. వైఎస్సార్ పల్నాడు కరువు నివారణ పథకం కింద రూ.340.26 కోట్ల వ్యయంతో చేపడుతున్న వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి కీలకమైన అటవీ, పర్యావరణ అనుమతులు సాధించి బుధవారం ఆయన మాచర్లలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గంలో పక్కనే నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ.. సాగు, తాగునీటి ఎద్దడి దశాబ్దాలుగా మన కళ్లెదుటనే కనిపిస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న పరిస్థితులు లేవన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందలేదన్న మాదిరిగా.. సముద్రంలో ప్రయాణిస్తున్న వారికి గుక్కెడు మంచి నీరు దొరకలేదన్న చందంగా ఇన్ని దశాబ్దాల పాటు కృష్ణమ్మ ఒడ్డున ఉన్న ఈ ప్రాంతానికి నది నీరు దక్కలేదని చెప్పారు. ఈ పరిస్థితిలో ప ల్నాటి ప్రాంత రూపురేఖలు మార్చేలా ఈ రోజు రూ.340 కోట్లతో వరికపూడిశెల ఎత్తిపోతల ద్వారా కృష్ణమ్మ నీరు అందిస్తామని గర్వంగా చెబుతున్నానన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మోసాల మాటలు నమ్మగలమా?

- గత చంద్రబాబు పాలనలో మనం మోసాలు, వెన్నుపోట్లు, అబద్ధాల చరిత్ర చూశాం. ఈ పెద్దమనిషి 14 ఏళ్లు సీఎంగా పని చేసినప్పటికీ కనీసం ఒక మంచి పని చేశానని చెప్పి ఓటు అడగలేడు. అందుకే మళ్లీ మోసం చేసేందుకు, ప్రజల్ని వెన్నుపోటు పొడిచేందుకు వెనుకాడడు. ఇంటింటికి కేజీ బంగారం, బెంజ్ కారిస్తాను.. ఓటు వేయండి అని చంద్రబాబు అడుగుతాడు. 34 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా కుప్పం నియోజకవర్గానికి నీరిచ్చిన చరిత్ర లేదు. ఇలాంటి వ్యక్తి మన మాచర్లకు, పల్నాడుకు మరో ప్రాంతానికి నీరు ఇస్తానని చెబితే నమ్మగలమా? కన్నతల్లికి అన్నం పెట్టని వాడు పిన్నమ్మకు మాత్రం బంగారు గాజులు కొనిస్తానని ఒకడు అన్నాడట. ఈ పెద్దమనిషిని చూస్తుంటే ఆ మాటలు గుర్తుకొస్తాయి. చివరికి కుప్పానికి నీళ్లు కావాలన్నా.. కుప్పానికి రెవెన్యూ డివిజన్ కావాలన్నా చేసేది మీ బిడ్డే.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- ఒకాయన ఎప్పుడూ మంచానికే పరిమితమై ఉంటాడట. లేస్తే మనిషిని కాదంటాడట. కానీ మంచంలోంచి లేవడు. చంద్రబాబు పరిస్థితి కూడా ఇంతే. తాను చేసిన మంచి ఏమిటనేది ఎప్పుడూ చెప్పడు. ఆయన 2000 సంవత్సరంలో ఉంటే 2047 గురించి చెబుతాడు. ఇప్పుడేం చేస్తావంటే చెప్పడు. 50 ఏళ్ల విజన్ అంటాడు. 50 ఏళ్ల తర్వా ఏం జరగబోతోందని చెబుతాడట. ఎందుకంటే 50 ఏళ్ల తర్వాత ఎవడుంటాడో? ఎవడు పోతాడో? ప్రజల చెవుల్లో క్యాలీఫ్లవర్ పెట్టడం ఈజీ కదా అని ఆలోచిస్తాడు. ఇలాంటి బాబు మాటలు నమ్మగలమా?

వెన్ను పోటు వీరుడు

- సొంత కూతురును ఇచ్చిన మామనే వెన్నుపోటు పొడిచిన వాడు, రాష్ట్రంలోని కోటీ 50 లక్షల కుటుంబాలకు వెన్నుపోటు పొడవకుండా ఉంటాడా? ఎస్సీ కులాల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అన్నారు. బీసీల తోకలు కత్తిరిస్తానని అహంకారంతో మాట్లాడాడు. ముస్లింలకు, ఎస్టీలకు కనీసం మంత్రి పదవి ఇవ్వని ఈ పెద్దమనిషి.. సమాజంలో ఏ వర్గానికైనా నా ఏనాడైనా న్యాయం చేశాడా? ఇలాంటి ఆయన నేను మారాను అంటే మనం నమ్మగలమా?
- గతంలో ఎన్నికలప్పుడు ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగం, ఉద్యోగం ఇవ్వకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి అన్నాడు. జాబు రావాలంటే బాబు రావాలి అని ఊదరగొట్టి మోసం చేశాడు. మన ప్రభుత్వం వచ్చేదాక గవర్నమెంట్ ఉద్యోగాలు 4 లక్షలు ఉంటే మరో 2 లక్షల 7 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత మన ప్రభుత్వానిది.

బాబు – దత్త పుత్రుడి మోసం

- తన బినామీ భూముల ధర బాగా పెరగాలన్న దుర్బుద్ధితో ఈ పెద్దమనిషి అమరావతిని ఒక రాజధానిగా భ్రమ కల్పించాడు. మూడు ప్రాంతాలకు ఏనాడైనా సమన్యాయం చేశాడా? తన హయాంలో పేదలకు కనీసం సెంటు భూమి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. మనం 31 లక్షల ఇంటి స్థలాలను నా అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుంటే కోర్టులకు వెళ్లి ఆపేందుకు కేసులు వేశారు.
- 2014లో ఇదే దత్తపుత్రుడు చంద్రబాబుతో కలిసే పోటీ చేశాడు. కలిసే మేనిఫెస్టో రిలీజ్ చేశాడు. ఆ మేనిఫెస్టోకు నాదీ పూచీ అన్నాడు. వీళ్లద్దరూ అయితే సరిపోరని వీరికి తోడు మోడీ గారి పేరు కూడా తెచ్చుకున్నారు. దారుణంగా ప్రజలను మోసం చేశారు. ఇది గత చరిత్ర. మేమంతా కలిసికట్టుగా మేనిఫెస్టోలో 5 హామీలు చెబితే... నేను దత్తపుత్రుడు కలిశాము కాబట్టి మరో 6 హామీలు ఇస్తున్నామని చెబుతారు. ఇవాళ వీళ్లు మాట్లాడుతున్న మాటలు చూస్తే నిజంగా వీళ్లు మనుషులేనా అనిపిస్తుంది.

బీ'టెక్కు' టమార విద్యలు!

- జూదం, క్రికెట్ బెట్టింగ్‌లలో సిద్ధహస్తుడు
- దౌర్జన్యాలకూ వెనుకాడని నైజం
- బీటెక్ రవిపై నమోదైన కేసులే ఇందుకు నిదర్శనాలు

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల టీడీపీ నేత బీటెక్ రవి దౌర్జన్యాలు, క్రికెట్ బెట్టింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచాడు. వివాదాస్పద వ్యవహారాలకు కేంద్ర బిందువయ్యాడు. ఇద్దరి మధ్య నెలకొన్న ప్రైవేటు వ్యవహారాల్లోనైనా తనదైన శైలిలో దౌర్జన్యాలకు పాల్పడటం పరిపాటైంది. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపైనా అలాంటి ధోరణినే ప్రదర్శిస్తున్నాడు. వైఎస్సార్ జిల్లాలో నమోదైన కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇలాంటి ఓ పెండింగ్ కేసులో బీటెక్ రవిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి.. కోర్టు ఆదేశాల మేరకు కడప సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపారు. బీటెక్ రవి ఈజీ మనీ సాధించడంలో సిద్ధహస్తుడు. ఈ క్రమంలోనే జూదం, క్రికెట్ బెట్టింగ్‌లు నిత్యకృత్యమయ్యాయి. బెట్టింగ్‌లో చిక్కుకుని యువత ఆత్మహత్యలు చేసుకుంటుండటంతో వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ వీటి నివారణకు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న పోరుమామిళ్లలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతూ సురేష్‌కుమార్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు పోలీసులకు పట్టుబడ్డారు. ఆ మేరకు క్రైమ్ నంబర్ 307/2023 ద్వారా కేసు నమోదైంది. ఇందులో లోతుగా దర్యాప్తు చేస్తే మొత్తం 41 మంది పాత్రధారులు, సూత్రధారుల ప్రమేయం ఉన్న ట్లు తేలింది. అందులో టీడీపీ నేత బీటెక్ రవి ఏ– 17గా ఉండటం విశేషం. ఈ క్రమంలో కోర్టులో పీటీ వారెంట్ వేసి, క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై బీటెక్ రవిని విచారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ప్రైవేటు వ్యవహారంలో సైతం..

పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం నాగులగట్టుపల్లెలో గోవిందు రామయ్యకు చెందిన భూమిని రమణ, సుబ్బయ్యలు కొని.. వెంచర్ వేశారు. స్థానిక టీడీపీ నేత మహేశ్వరరెడ్డికి వారితో వివాదం ఏర్పడితే.. ఏప్రిల్ 30న బీటెక్ రవి మందీమార్బలంతో వాహనాలతో వెళ్లి రమణ, సుబ్బయ్యలపై దౌర్జన్యం చేసి, వెంచర్‌ను సైతం ట్రాక్టర్లతో దున్నేశారు. అప్పట్లో క్రైమ్ నంబర్ 40/2023 ద్వారా కేసు నమోదైంది. ఇలాంటి పరిస్థితి పోలీసు ఆఫీసర్‌కూ ఎదురైంది. ఈ ఏడాది జనవరి 26న కడప ఎయిర్‌పోర్టుకు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వస్తున్న నేపథ్యంలో అక్కడికి బీటెక్ రవి తన అనుచరులతో కలిసి వెళ్లాడు. మూకుమ్మడిగా ఎయిర్‌పోర్టులోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్న ఏఎస్ఐ దివాకర్ అడ్డుకునే యత్నం చేశారు. బీటెక్ రవి.. అతడిని తోసేయడంతో కింద పడిపోయారు. కాలు ఫ్యాక్చర్ అయ్యింది. ఈ కేసులో బీటెక్ రవి ప్రధాన నిందితుడు. ఇలాంటివి ఆయన జీవితంలో సర్వసాధారణమని చెబుతున్నారు. కాగా బీటెక్ రవిపై 9 కేసులు వివిధ దశల్లో ఉన్నాయి.

చంద్రబాబు ప్రోద్బలంతోనే స్కిల్ కుంభకోణం

ముందే రూ.330 కోట్లు విడుదల చేసేశారు

- అతనికి బెయిల్ ఇస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం
- హైకోర్టుకు నివేదించిన ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి సీమెన్స్ సంస్థ తాను వెచ్చించాల్సిన 90 శాతం నిధులను ఖర్చుచేయకముందే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ.330 కోట్లను విడుదల చేసేసిందని, దీని వెనుక కుట్ర, ముందస్తు వ్యూహాలు ఉన్నాయని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఇలా చేయడం ద్వారా రూ.214 కోట్లను పలు షెల్ కంపెనీల ద్వారా దారిమళ్లించారని తెలిపారు. నిధుల మళ్లింపును ఫోరెన్సిక్ ఆడిట్ సైతం ధ్రువీకరించిందని చెప్పారు. ఈ కుంభకోణం గత ప్రభుత్వ హయాంలోనే బయటపడిందని, దీనిపై ఏసీబీ విచారణ కూడా జరిగిందని తెలిపారు. అయితే ఈ కుంభకోణంలో అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్ర ఉండటంతో అది బయటకు రాకుండా తొక్కిపెట్టారని వివరించారు. 2018లో జరిగిన కుంభకోణంపై సీఐడీ చేస్తున్న దర్యాప్తును రాజకీయ ప్రేరేపితమని, రాజకీయ కక్షసాధింపు అని చెప్పడం దారుణమన్నారు. ఈ కుంభకోణం వెనుక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నారని చెప్పారు. ఇందుకు నోట్‌ఫైళ్లే సాక్ష్యమన్నారు. చంద్రబాబు ప్రోద్బలంతోనే రూ.330 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఈ విషయంలో ఆర్థికశాఖ అభ్యంతరాలను సైతం చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధినేతగా, మాజీ ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు ఎంతో పలుకుబడి ఉందని, అందువల్ల ఈ కేసులో ఆయనకు బెయిల్ ఇస్తే దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. పైపెచ్చు దర్యాప్తు కీలకదశలో ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చంద్రబాబు తన ప్రధాన బెయిల్ పిటిషన్‌లో ఇప్పటివరకు వాదనలు వినిపించలేదన్నారు. వాదనలు వినిపించినట్లు ఆయన న్యాయవాదులు చెబుతున్న నేపథ్యంలో ఆ వివరాలను రికార్డ్ చేయాలని సుధాకర్ రెడ్డి కోర్టును కోరారు. చంద్రబాబు న్యాయవాదులు కేవలం మధ్యంతర బెయిల్‌పై మాత్రమే వాదనలు వినిపించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు సమయం ముగియడంతో తదుపరి వాదనల నిమిత్తం విచారణ గురువారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ మల్లికార్జునరావు విచారించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

బల్మూర్: చెట్టుకు ఉరితో వేలాడుతూ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని గట్టుతుమ్మెన్ శివారులో బుధవారం వెలుగు చూసింది. ఉప్పునుంతల మండలం ఉప్పరిపల్లికి చెందిన వంకేశ్వరమ్మ(45)కు నాగర్‌కర్నూల్‌కు చెందిన చంద్రకాంత్‌తో 25 ఏళ్ల క్రితం వివాహం కాగా వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. వీరిద్దరి మధ్య మనస్పర్థాలతో ఏడాది నుంచి వంకేశ్వరమ్మ తల్లి ఇంటి వద్ద విడిగా ఉంటుంది. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బుధవారం ఉదయం నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిలోని గట్టుతుమ్మెన్ శివారులో ఓ రైతు వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరితో వేలాడుతూ మహిళ మృతదేహం కనిపించడంతో రైతులు సర్పంచ్ నాగరాజుకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శేఖర్‌రెడ్డి చేరుకుని మృతురాలి వివరాలపై విచారించగా ఉప్పరిపల్లికి చెందిన మహిళగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుమారుడు గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతురాలి భర్తనే ఫోన్ చేసి ఉప్పరిపల్లి స్టేజి వద్దకు పిలిపించి హత్యచేసి చెట్టుకు ఉరివేసి పారిపోయి ఉంటాడని కుటుంబసభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దుస్తులు ఉతికేందుకు వెళ్లి..

- కాల్వలో పడి మహిళ గల్లంతు



గల్లంతైన పద్మమ్మ (ఫైల్)

కొత్తకోట రూరల్: దుస్తులు ఉతికేందుకు గ్రామ సమీపంలోని పీజేపీ కాల్వ వద్దకు వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు కాల్వలో పడి గల్లంతైన సంఘటన బుధవారం సాయంత్రం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం మిరాసిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పద్మమ్మ(40) గ్రామ శివారులోని పీజేపీ కాల్వలో దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాల్వలో పడటంతో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోయింది. సమీప పొలాల వారు పద్మమ్మ నీటిలో మునిగేటప్పుడు వేసిన కేకలను చూసి భర్తకు సమాచారం చేరవేశారు. భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పద్మమ్మ కోసం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు.

మద్యం తరలిస్తున్న డీసీఎం పట్టివేత

- జీఎస్టీ అధికారుల ఫోన్లు లాక్కొని దాడికి యత్నం



జడ్చర్ల డీటీసీలో పట్టుబడిన మద్యం డీసీఎం



బీపనగండ్లలో పట్టుబడిన మద్యంతో పోలీసులు

జడ్చర్ల: మద్యం తరలిస్తున్న డీసీఎంను జీఎస్టీ ఉన్నతాధికారులు పట్టుకున్నారు. అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను ఇవ్వాలని కోరిన అధికారులపై కొందరు దౌర్జన్యానికి దిగి వారి దగ్గర ఉన్న మొబైల్ ఫోన్లను లాక్కుని దాడికియత్నించారు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పట్టణ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై రాష్ట్ర వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ తాటికొండ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో ఓ డీసీఎంను తనిఖీ చేయగా అందులో మద్యం కాటన్‌లు కన్పించాయి. అందుకు సంబంధించిన అనుమతి పత్రాలను చూపించాలని అధికారులు కోరారు. అంతలోనే దాదాపు 15 మంది గుర్తు తెలియని వ్యక్తులు ఒక్కసారిగా అధికారుల దగ్గరకు వచ్చి గొడవకు దిగారు. డీసీఎంను తనిఖీ చేయడానికి మీరెవరంటూ ప్రశ్నించారు. తాము జీఎస్టీ అధికారులమని తమకు తనిఖీ చేసే అధికారాలు ఉంటాయని నచ్చజెప్పారు. తమ ఐడీ కార్డులు సైతం వారికి చూపించారు. వారు ససేమిరా అంటూ తమ డీసీఎంను విడిచి పెట్టాలని బెదిరంపులకు దిగారు. అధికారులు అప్పటికే డీసీఎంలో ఉన్న మద్యం కాటన్లు, డీసీఎంను ఫొటోలు, వీడియోలు తీశారు. గమనించిన వారు అధికారుల వద్ద ఉన్న ఫోన్లు లాక్కొని వీడియోలు, ఫొటోలను డెలిట్ చేశారు. ఒకరు అధికారుల మొబైల్ ఫోన్ నుండి తన ఫోన్ (9000478047)కు ఫోన్ చేశాడు. తదుపరి డీసీఎంను అక్కడి తప్పించుకుని తీసుకెళ్లిపోయారు. దీంతో జీఎస్టీ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విధులకు ఆటంకం కలిగించి, తమను అడ్డుకున్న దుండగులపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా ఈ నేపథ్యంలో పోలీసుల డీసీఎంను ఆధీనంలో తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు చేర్చారు.

ఎక్కడి నుంచి ఎక్కడకు?

అసలు పట్టుబడిన మద్యం డీసీఎం ఎక్కడి నుంచి వచ్చింది. ఎక్కడికి వెళ్తుంది.. జీఎస్టీ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడింది ఎవరనే అనుమానాలు రేకెత్తాయి. అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చిన నేతలు ఎవ్వరన్న దానిపై అధికారులు పారదర్శకంగా విచారణ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై స్థానిక ఎక్సైజ్ సీఐ బాలాజీని వివరణ కోరేందుకు ప్రయత్నించినా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. ఏదీ ఏమైనా ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ఇలాంటి మద్యం వాహనాలు మరింతగా పట్టుబడే అవకాశం ఉంది.

172 లీటర్లు..

బీపనగండ్ల: మండలంలోని తూంకుంటలో సుంకరి సతీష్‌గౌడ్ ఇంట్లో బుధవారం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. రూ.1,72,000 విలువ గల 172 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. మండలంలో ఎన్నికల నిబంధనలను అనుసరించి అక్రమ మద్యం విక్రయించినా, నిల్వ చేసినా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తామని జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కల్యాణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హన్వాడ: మండలంలోని యారోనిపల్లికి చెందిన వడ్డె బాలస్వామి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలస్వామి మండల కేంద్రానికి సొంత పనుల నిమిత్తం బుధవారం బైక్‌పై వచ్చాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మధ్యాహ్నం కొనగట్టుపల్లిగేట్ సమీపంలో ఎదురుగా ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సాయంత్రం హైదరాబాద్ తరలించడంతో పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడని గ్రామస్తులు తెలిపారు. ఈవిషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం రాలేదని పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ అక్బర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని కోటకదిర రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి(40) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృత దేహం గుర్తించలేని విధంగా ఛిద్రంగా మారిందని తెలిపారు. పోస్టుమార్టం కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ వెల్లడించారు.

బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తా

- విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థి

గండేడ్: ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. మండలంలోని పెద్దవార్వాల్‌కు చెందిన విద్యార్థులు బస్సు సౌకర్యం లేకపోవడంతో కళాశాలకు వెళ్లేందుకు ఆటోలో గండేడ్‌కు బయలుదేరారు. ఉదయం 9గంటలకు సాలార్‌నగర్ గేటు వద్దకు రాగానే ఎదురుగా బైక్ వచ్చింది. దాన్ని తప్పించబోవడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పెద్దవార్వాల్ చెందిన శివకు కాలు, చెయ్యి విరిగాయి. చందన, ముస్రీన్‌బేగం, శివకు గాయాలయ్యాయి. వీరు నలుగురు మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో, మరో ఇద్దరు కోస్గి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడం మూలంగానే ఆటోల్లో వెళ్లి విద్యార్థులు ప్రమాదం బారిన పడ్డారని స్థానికులు తెలిపారు.

మూడు నెలల జైలుశిక్ష

గద్వాల క్రైం: చోరీ కేసులో ఇద్దరు నిందితులకు మూడు నెలల పాటు జైలు శిక్ష విధిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌నాయక్ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ రితిరాజ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఫక్రుద్దీన్ ఆటోను కొన్ని రోజుల కిందట హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్ (నవాజ్), హలీమ్ చోరీ చేశారు. ఈ కేసును కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా.. నేరం రుజువైంది. దీంతో జడ్జీ నిందితులకు మూడు నెలల పాటు జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించారని ఎస్పీ పేర్కొన్నారు. కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సిబ్బంది, ఆ కోర్టు ఏపీపీ రెడల్ సంజన జాషువాని ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

జూరాలకు పెరిగిన వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం 4 వేల క్యూసెక్కులు ఉండగా.. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో 6 వేల క్యూసెక్కులకు పెరిగిందన్నారు. ఆవిరి రూపంలో 89 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300, సమాంతర కాల్వకు 550, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కులు మొత్తం 2,940 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.319 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

జోగుళాంబ ఆలయానికి రూ.1.34 కోట్ల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న ఆలయ ఈఓ పురేందర్ కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాల్లో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్ నేతృత్వంలో నిర్వహించిన వేలంలో ముందుగా సీడీలు, పుస్తకాలు, ఫొటోలు విక్రయించుకునేందుకు గాను పట్టణానికి చెందిన కె.సురేష్ రూ.5.50 లక్షలకు వేలం దక్కించుకున్నాడు. అలాగే కొబ్బరి చిప్పలను పోగు చేసుకునేందుకు పట్టణానికి చెందిన ఉషారాణి రూ.12.20 లక్షలకు వేలం దక్కించుకుంది. వాహనాల పార్కింగ్‌కు సంబంధించి సత్యనాగేష్ రూ.55 లక్షలకు, టెంకాయ, పూజ సామగ్రి విక్రయించుకునేందుకు ఎస్.ఆంజనేయులు రూ.55.20 లక్షలకు, శౌచాలయాల నిర్వహణకు ఏ.శివరాముడు రూ.లక్షకు వేలంలో కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ ధర్మకర్త సభ్యులు జల్లాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణ, వెంకటేష్, కాశన్న, అడవప్ప, ఆలయ ముఖ్య అర్చకులు, ఎక్స్ అఫిషియో మెంబర్ ఆనంద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే పెద్ద పెద్ద భవనాలు కాదు

- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



మాట్లాడుతున్న కన్వీనర్ రాఘవాచారి

బిజినేపల్లి: అభివృద్ధి అంటే పెద్ద పెద్ద భవనాలు, రహదారుల నడుమ డివైడర్లు నిర్మిస్తే కాదని.. ప్రజల అప్పు శక్తిని తగ్గించి, ఒకరిపై ఆధారపడకుండా వారి అవసరాలు తీర్చుకునే వనరులు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటికి పెద్ద కొడుకులా ఆడపిల్ల పెళ్లి చేశానని చెప్పి ఓట్లు దండుకోవడం కాదని.. ప్రతి ఇంటికి తానే పెద్ద కొడుకునని చెప్పి ఆ ఇళ్లలోని నిజమైన వారసులకు సమాజంలో విలువ, గౌరవం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఓటు వేసినందుకుగాను వారి వారి స్థాయిని బట్టి ఉపాధి అవకాశాలు కల్పించాలేగాని.. పెళ్లిళ్లు, పథకాలు, చావులప్పుడు ఆర్థిక సాయం చేయడం కాదన్నారు. తెలంగాణ సాధించిన ఉద్దేశం, దాని ఫలితాలు ఎంతవరకు వచ్చాయో ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. సాగునీటి సాధన పేరుతో సాధించుకున్న తెలంగాణలో ఇప్పటి వరకు నదీ జలాల నీటివాటా తేల్చని ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని.. నియామకాల పేరుతో నిరుద్యోగులను గొర్రెలు, బర్రెల కాపరులుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల పేరుతో తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. సమావేశంలో వేదిక కల్వకుర్తి కన్వీనర్ అశోక్, కార్యవర్గసభ్యుడు మస్కూరి శంకర్ పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం : రూ.మూడు లక్షల ఆస్తి నష్టం



కాలిన సామగ్రిని చూపుతున్న బాధితురాలు

బల్మూర్: విద్యుదాఘాతంతో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని బాణాలలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జంగాల వెంకటయ్యకు పూరి గుడిసె ఉండటంతో ఆర్డీటీ సంస్థ వారు పక్కనే ఇల్లు నిర్మించి ఇస్తున్నారు. మంగళవారం రాత్రి నిర్మాణంలో ఉన్న ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తుండగా రాత్రి 11.30 గంటల ప్రాంతంలో గుడిసెకు నిప్పంటుకొంది. గుర్తించి కేకలు వేసినా గుడిసెలో గ్యాస్ సిలిండర్ ఉండటంతో పేలుతుందనే భయంతో మంటలను ఆర్పడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో గుడిసె కళ్ల ముందే పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో ఇంటి గృహ ప్రవేశం, విద్యుత్ వైరింగ్ కోసం దాచిన రూ.40 వేల నగదుతో పాటు 1.50 తులాల బంగారం, రెండు క్వింటాళ్ల బియ్యం, దుస్తులు, వంటసామగ్రి, టీవీ, కుట్టుమిషన్, డీఏపీ సంచులు, పట్టాదారు పాసు పుస్తకాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. సర్పంచ్ పద్మ, డీలర్ రామ్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్ఐ పద్మ గ్రామానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.